ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 24: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని బోధన్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు సూచించారు. బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ వైటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, ద్విచక్రవాహనాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు అప్పగిస్తే కేసులు నమోదు అవుతాయని చెప్పారు. అనంతరం ఎంవీఐ శ్రీనివాస్ రావును సన్మానించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ బెల్లిన, ఉపాధ్యాయులు, లయన్స్ జోన్ చైర్మన్ లంక రవి, క్లబ్ ప్రెసిడెంట్ లయన్ లంక జెరూష, క్లబ్ ట్రెజరర్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ సూర బత్తుని శ్రీనివాస్, క్లబ్ ప్రతినిధులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మోర్తాడ్/మాక్లూర్/రెంజల్, ఆగస్టు24: మాక్లూర్ మండలంలోని బోర్గాం(కె), మానిక్‌బండార్ గ్రామాల్లో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సుందరగిరి దిలీప్‌కు రూ.29వేలు, కోటగిరి రాజాగౌడ్‌కు రూ.55వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి అందజేశారు. రెంజల్‌లో మండలానికి చెందిన 79 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు అందించారు.

అఖండ శివనామ సప్తాహం ప్రారంభం

కోటగిరి, ఆగస్టు 24 : స్థానిక పోచారం కాలనీలోని శ్రీ అభయ బసవేశ్వర మందిరంలో అఖండ శివనామ సప్తాహం శనివారం ప్రారంభమైంది. ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, పారాయణం, భక్తి కీర్తనలు, ప్రవచనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

4 నుంచి 18 వరకు జెండా జాతర

సుభాష్‌నగర్, ఆగస్టు 24 : ఇందూరు తిరుమలగా ఖ్యాతిగాంచిన జెండా బాలాజీ జాతర ఉత్సవాలు సెప్టెంబర్ 4 నుంచి 18వ తేదీవరకు వరకు కొనసాగుతాయని ఆలయ ఈవో విజు పల్లి వేణు తెలిపారు. ఆలయంలో శనివారం పూజలు చేసి మాట్లాడారు. సెప్టెంబర్ 4న జెండా ఉత్సవమూర్తులకు వంశ పారంపర్య అర్చకుడు అజయ్ సంగ్వాయి ఇంటివద్ద పూజలు చేసి ఊరేగింపుగా ఆలయంలో ప్రతిష్ఠిస్తారని, 6న కలశపూజ, పంచామృతాభిషేకం, 7న విశేషపూజలతో పాటు వేదపఠనం, 14న వాహనసేవ, 15న తిరు నక్షత్ర శ్రీవారి కల్యాణం, 18న జెండా ఉత్సవాల ముగింపు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పూలాంగ్ బ్రిడ్జి వద్ద స్థాపన ఉంటాయని వివరించారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, ధర్మకర్తలు రాముగౌడ్, రాజేశ్వర్, గైని విజయ, పోలకొండ నర్సింగ్‌రావు, తుమ్మ నాగభూషణం పాల్గొన్నారు.

రైతు ధర్నాకు కదిలిన అన్నదాతలు

ధర్పల్లి నుంచి రైతు ధర్నాకు తరలివెళ్తున్న రైతులు

జక్రాన్‌పల్లి నుంచి..

సిరికొండ మండలం గడ్కోల్ నుంచి..

మోర్తాడ్ నుంచి మహాధర్నాకు తరలివెళ్తున్న రైతులు

ఏర్గట్ల మండలం బట్టాపూర్ నుంచి..

రైతు రుణమాఫీ అర్హులందరికీ వర్తింపజేయాలని ఆర్మూర్‌లో శనివారం చేపట్టిన రైతు ధర్నాకు ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామ రైతులు కదం తొక్కారు. రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందొకటి, చేస్తున్నదొకటని, రైతులను మోసం చేస్తే తగిన బుద్ధి చెబుతామని, రుణమాఫీ రైతులందరికీ అందేవరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.
– నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఆగస్టు 24

ప్రశాంత్‌జోషికి పీహెచ్‌డీ పట్టా

సుభాష్‌నగర్, ఆగస్టు 24 : ప్రముఖ పంచాగకర్త ప్రశాంత్‌జోషి సిద్ధాంతికి ఆస్ట్రాలజీ విభాగంలో ఉదయ్‌పూర్ మహర్షి కాలేజ్ ఆఫ్ వేదిక్ డాక్టరేట్ పట్టాను అందజేసింది. ఆయన శుక్రవారం డాక్టరేట్‌ను అందుకున్నారని తెలంగాణ గాయత్రి ధార్మిక వేదిక సమితి ఇందూరు అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. దశాబ్దకాలంగా శ్రీ జ్ఞాన సరస్వతి పంచాంగం రూపొందించడంతోపాటు నవగ్రహ సమయ ధృగ్ సిద్ధాంతం అంశంపై పరిశోధన చేశారు. సిద్ధాంతానికి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. రెండోసారి డాక్టరేట్‌ను అందుకోవడంపై బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌డీ పట్టాతో ప్రశాంత్‌జోషి

చెత్త తొలగించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ గంగారాం

బోధన్, ఆగస్టు 22: పట్టణంలోని అన్ని వార్డుల్లో చెత్త పేరుకుపోయిందని, వెంటనే తొలగింపజేయాలని కోరుతూ బోధన్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ బెంజర్ గంగారాం అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో శనివారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ వార్డులో తాగునీటి సమస్య ఉందని, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ పట్టించుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. విలీన గ్రామం శ్రీనివాస్‌నగర్‌లో రోడ్లు అధ్వానంగా మారాయని తెలిపారు.

జిల్లాకేంద్రంలోని బార్ అసోసియేషన్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజే శనివారం సందర్శించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, పలు అంశాలపై చర్చించారు.
– వినాయక్‌నగర్, ఆగస్టు 24

చేనేత డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 24 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు రాఘవరావు అన్నారు. పోచమ్మగల్లీలోని చేనేత సహకార సంఘ కార్యాలయంలో చేనేత వృత్తులు తదితర అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10వ తరగతి పాసై, 23 ఏండ్ల లోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో చేనేత సహకార అభివృద్ధి అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దుద్దెటి రామకృష్ణ, ఆర్మూర్, బోధన్ అధ్యక్షులు కామిని రామకృష్ణ, నారాయణ, చేనేత కమిటీ కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేయాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 24 : అప్లాయిడ్ ఎకనామిక్స్ ఐఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ – టీయూ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సాయిలుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పరీక్షలు పూర్తయి నెలరోజులు గడిచినా ఇప్పటివరకు ఫలితాలను వెల్లడించలేదని అన్నారు. నాయకులు ప్రిన్స్, దేవిక, రవీందర్, అక్షయ్, వంశీ, రాకేశ్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

ఖలీల్‌వాడి, ఆగస్టు 24 : నగరంలోని బీసీ బాలబాలికల సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి స్రవంతికి శనివారం వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ.. నగరంలో బాలుర, బాలికలకు మూడు చొప్పున ప్రభుత్వ హాస్టళ్లు మాత్రమే ఉన్నాయని, ఉన్న హాస్టళ్లలో మౌలిక వసతులు లేవని అన్నారు. నాందేవ్‌వాడ, మిర్చికాంపౌండ్ బాలుర వసతిగృహం కూలిపోయే దశలోఉన్నదని, వసతిగృహాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, సంతోష్, శన్ను వర్మ, నిఖిత, దివ్యరాణి పాల్గొన్నారు.

కల్తీ మద్యం, బెల్టు షాపులను అరికట్టాలి

ధర్పల్లి/ సిరికొండ, ఆగస్టు 24 : సిరికొండ, ధర్పల్లి మండలాల్లో కల్తీ మద్యం, బెల్టు షాపుల నిర్వహణను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్యంప్రియులను నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. గ్రామాల్లో వీడీసీలతో కలిసి వేలం పాడి మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం, బెల్ట్‌షాపులను అరికడుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు దాని ఊసెత్తడం లేదన్నారు. నాయకులు దామోదర్, సాయరెడ్డి, రమేశ్, ఆశిష్ పాల్గొన్నారు.

సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో దంత వైద్యశిబిరం

సారంగాపూర్, ఆగస్టు 24 : నగర శివారులోని సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో మేఘన డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ ఆదిత్యరాజ్ ఆధ్వర్యంలో వైద్యబృందం 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సల్ల సత్యనారాయణ, వైద్యులు సాహితి, వైష్ణవి, పల్లవి, శ్రీమాన్, వసీదుద్దీన్, అనూష, ఉపాధ్యాయులు గోపాల్, మహ్మద్ జావిద్, విద్యాసాగర్, గంగాధర్, ఘనపురం దేవేందర్ పాల్గొన్నారు.

26న ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి

సమావేశంలో మాట్లాడుతున్న రమానంద రయా గౌర

- కందేశ్వర్ శాఖ అధ్యక్షుడు రమానంద రయా గౌర

ఖలీల్‌వాడి, ఆగస్టు 24 : ఇస్కాన్ కందేశ్వర్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న విజయ లక్ష్మీ గార్డెన్స్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రమానంద రయా గౌర తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 26న ఉదయం ఇస్కాన్‌కేంద్రంలో, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 12 గంటలకు వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు భక్తులు విరాళాలు అందజేయాలని కోరారు. 25న కూడా ఇస్కాన్ కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల భజన, హరినామ సంకీర్తన, భగవద్గీత ప్రవచనం, మహాహారతి అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనన్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలి

- కలెక్టర్‌ను కోరిన అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, ఆగస్టు 24 : వర్ని రోడ్డులోని నాలాలో గల్లంతైన అనన్య (2) కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా కోరారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు శనివారం ఫోన్ చేసి కోరారు. బిగాల సూచనల మేరకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, మున్సిపల్ కమిషనర్ మకరందకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, కార్యదర్శి ఎనుగందుల మురళి, సత్యప్రకాశ్, కార్పొరేటర్ విక్రమ్‌గౌడ్, పోల నారాయణ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సర్వే పరిశీలన

కోటగిరి, ఆగస్టు 24 : గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు నాలుగేండ్ల క్రితం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా.. వాటిని ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ పరిశీలించారు. లింగాపూర్, కోటగిరితో పాటు పలు గ్రామాల్లో శనివారం పర్యటించి సర్వేలను పరిశీలించారు. అడ్కాస్‌పల్లి 1, లింగాపూర్ 1, కోటగిరి మండల కేంద్రంలో 5 దరఖాస్తులు వచ్చాయని, వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన బాలుడి పరిస్థితి విషమం

శక్కర్‌నగర్, ఆగస్టు 24: బోధన్ పట్టణంలోని తట్టికోట్‌లో కుక్కల దాడిలో గాయపడిన రెండేండ్ల బాలుడు నిహాల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకుల ద్వారా తెలిసింది. బాలుడికి స్థానిక దవాఖానలో చికిత్స చేయించిన అనంతరం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానకు తరలించారు. బాలుడి కుటుంబసభ్యులు వైద్య ఖర్చుల కోసం దాతలను అభ్యర్థిస్తూ ఎక్స్‌లో శనివారం ట్వీట్ చేశారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

కోటగల్లీలోని జీపీఎస్‌లో..

తడ్‌పాకల్ ప్రభుత్వ పాఠశాలలో

ఖలీల్‌వాడి/ కోటగిరి/ ధర్పల్లి/ మోర్తాడ్/ఏర్గట్ల/ బాల్కొండ/ భీమ్‌గల్/ బోధన్‌రూరల్/ మాక్లూర్, ఆగస్టు24: ఆగస్టు 24 : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పాఠశాలల్లో ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సాంస్కృతిక, గోపాల కాల్వ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఉన్న జీపీఎస్‌లో, కోటగిరి మండల కేంద్రంలోని శ్రీవేద పాఠశాలలో, ధర్పల్లి మండలకేంద్రంలోని లిటిల్‌హార్ట్స్ పాఠశాలలో, రుద్రూర్‌లోని శ్రీవాణి సాహితీ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, బాల్కొండ, భీమ్‌గల్, మాక్లూర్, బోధన్, సాలూరా తదితర మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కమ్మర్‌పల్లిలోని మిసిమి పాఠశాల, ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ ప్రభుత్వ పాఠశాల, మండల కేంద్రంలోని నలంద, అపూర్వ, హయగ్రీవ, తాళ్ల రాంపూర్‌లోని నవ్యభారతి ప్రైవేటు పాఠశాలల్లో ఉత్సవాలు నిర్వహించారు. బాల్కొండలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, సాలూర మండల కేంద్రంలోని వాగ్దేవి, భీమ్‌గల్‌లోని లిటిల్ ఫ్లవర్, మాక్లూర్ మండలం గుత్పలోని సీపీఆర్ఎంఎస్ ఉన్నత పాఠశాలల్లో వేడుకులు ఘనంగా నిర్వహించారు.

అనన్య కుటుంబానికి అర్బన్ ఎమ్మెల్యే పరామర్శ

వినాయక్‌నగర్, ఆగస్టు 24 : డ్రైనేజీలో గల్లంతై మృతిచెందిన చిన్నారి అనన్య కుటుంబాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేయడంతోపాటు అండగా ఉంటామని అన్నారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్స్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి పీపీగా శ్యామ్‌రావు

బోధన్, ఆగస్టు 24: నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బోధన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది, బోధన్‌లోని ఐదో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యామ్‌రావు నియమితులయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు పీపీగా ఉన్న పి.రవిరాజ్ పదవీ కాలం శుక్రవారం ముగిసింది. దీంతో శ్యామ్‌రావును నియమించారు.

విద్యార్థులకు సాహిత్యంపై అవగాహన

మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వర్‌శర్మ

మాక్లూర్, ఆగస్టు 24: యువతరం –సాహిత్య సృజన అనే అంశంపై స్కూల్ ఆఫ్ ఎమర్జింగ్ రైటర్స్, దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల తెలుగు, ఇంగ్లిష్ విభాగం వారు సంయుక్తంగా శనివారం కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ధాత్రిక వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన ఈ కార్యశాల కొనసాగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ రాజేశ్వర్‌శర్మ మాట్లాడారు. కథలు శాస్త్రీయ విజ్ఞానానికి దారి తీస్తాయని విద్యార్థులకు తెలిపారు. బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ మాట్లాడుతూ కథలు ఎలా రాయాలో వివరించారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సరిత, ఎమర్జింగ్ రైటర్స్ కోఆర్డినేటర్ సంధ్య, దీప్తి పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు డాక్టరేట్

డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు24: ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. చదువుపై ఉన్న మమకారంతో ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

శక్కర్‌నగర్, ఆగస్టు 24: బోధన్ పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా బోర్లు వేయించారు. స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ దేగావత్ ధూప్‌సింగ్ నాయక్‌కు గ్రామస్తులు సమస్యను వివరించడంతో ఆయన బోర్లు వేయించారు. అనంతరం వాటికి మోటార్లు బిగించారు. శక్కర్‌నగర్‌లోని ఓ కాలనీలోనూ బోరు వేయించారు. ఈ బోరుకు కూడా మోటారు బిగించారు.

పౌష్టికాహారంపై అవగాహన

మాక్లూర్, ఆగస్టు24: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీకేర్ ఎడ్యుకేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై వివరించారు. సూపర్‌వైజర్ మమత, ఏఎన్ఎంలు శాంత, అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

భీమ్‌గల్, ఆగస్టు 24: మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న 13 మంది లబ్ధిదారుల్లో 11 మందికి శనివారం చెక్కులు అందజేసినట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జావిద్, ఉపాధిహామీ ఏపీవో నర్సయ్య, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు జల్లాపల్లిఫారం – కోటగిరికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. కోటగిరి వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సామాజిక సేవాకర్త హకీం సహకారంతో జల్లాపల్లి ఫారం యువకులు మొరంతో గుంతలను పూడ్చివేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.
– పోతంగల్, ఆగస్టు 24

పొంచి ఉన్న ప్రమాదం

బోధన్ పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ షెడ్డులో ఏండ్ల కాలంగా హోటల్ కొనసాగుతోంది. కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఈ హోటల్‌లో టీ తాగేందుకు వెళ్లి కాలక్షేపం చేస్తారు. ఈ షెడ్డు శిథిలావస్తకు చేరింది. ఈ షెడ్డును కూల్చివేయించేందుకు గతంలో ఓ అధికారి చర్యలు చేపట్టారు. అదే సమయంలో ఆయన బదిలీపై వెళ్లారు. దీంతో షెడ్డు కూల్చివేత ఆగిపోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – శక్కర్‌నగర్, ఆగస్టు 24

వాటర్ బాటిళ్ల పంపిణీ

విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేస్తున్న దాతలు

వేల్పూర్, ఆగస్టు 24: మండలంలోని కుకునూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్ తమ్ముడు అనుసూరి వసంత్ సాయి శనివారం దాదాపు రూ.20 వేల విలువైన 100 స్టీల్ వాటర్ బాటిళ్లను అందించారు. తాను చెప్పగానే స్పందించిన సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ (జీఎస్టీ) వసంత్‌సాయి, అతని సతీమణి స్టేట్ బ్యాంకు అధికారిణి మౌనిక స్పందించి వాటర్ బాటిళ్లను అందించారని హెచ్ఎం తెలిపారు. దాతలను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బాల్కొండ, ఆగస్టు 24: స్థానిక మహతీ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు శనివారం ఆర్మూర్ లయన్స్‌క్లబ్ నవనాథపురం ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపవర్ నిర్మాణ్ వారోత్సవాల చివరి రోజు సందర్భంగా పుస్తకాల అందజేశామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, గౌరవ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రెంజల్, ఆగస్టు 24: స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్ల సోమలింగం, ప్రధాన కార్యదర్శిగా కిశోర్, అసోసియేట్ అధ్యక్షుడిగా రఫీకుల్ హైమద్, కార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి, రాజశ్రీ, మహిళా ఉపాధ్యక్షురాలిగా అపర్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గన్నా ఉపాధ్యాయులు సన్మానించారు. ఆసంఘంజిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంఖర్ ఎన్నిక అధికారులుగా వ్యవహరించారు.

సంక్షిప్తంగా..

- **మొక్కలు నాటిన ఆర్డీవో-** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు24: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో శనివారం ఆర్డీవో రాజాగౌడ్ స్వామి వారికి పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.
- **ఏవోగా సాయికృష్ణ -** బాల్కొండ(ముప్కాల్), ఆగస్టు 24: ముప్కాల్ మండల వ్యవసాయాధికారిగా జి.సాయికృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన భీమ్‌గల్ నుంచి బదిలీపై వచ్చారు.
- **ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు–** భీమ్‌గల్, ఆగస్టు 24: తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ చదివేందుకు ఆసక్తి ఉన్న వారు స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ స్వామి కోరారు. వివరాలకు సెల్ 9948082804లో సంప్రదించాలని కోరారు.
- **ఓరియంటేషన్ కార్యక్రమం –** మాక్లూర్, ఆగస్టు 24 : దాస్‌నగర్‌లోని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆత్మీయత సమాచారంతో కూడిన అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- **ఇసుక టిప్పర్ల పట్టివేత-** ఎడపల్లి, ఆగస్టు 24: ఎడపల్లి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా శనివారం బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న మూడు ఇసుక టిప్పర్లను ఎడపల్లి తహసీల్దార్ పట్టుకొని ఎడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు ఉంటాయని ఎస్సై వంశీకృష్ణా రెడ్డి హెచ్చరించారు.
- **ఇసుక డంపులకు వేలం-** పోతంగల్, ఆగస్టు 24 : అక్రమ ఇసుకను అధికారులు ఇటీవల సీజ్ చేయగా.. తహసీల్ కార్యాలయంలో శనివారం వేలం నిర్వహించారు. మండలకేంద్రానికి చెందిన గంధం దత్తు రూ. 20 వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలి

కోనాసముందర్‌లో వైద్యచికిత్స కోసం వచ్చిన ప్రజలు

మోర్తాడ్/మాక్లూర్, ఆగస్టు24: ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచించారు. కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్‌లో చౌట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సుప్రియ ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, ఏఎన్ఎం అమృత పాల్గొన్నారు. మాక్లూర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యుడు ప్రకాశ్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి వెంకటేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ మండల అధ్యక్షుడిగా తొగరి సాయిలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 24 : సోషల్ జస్టీస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన తొగరి సాయిలును నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ నియమించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొప్పు రాజేందర్.. తొగరి సాయిలుకు నియమాక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఏనుగంటి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి బట్టి దత్తాద్రిగౌడ్, జిల్లా కార్యదర్శి పసుల ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు గ్రామాలకు వేర్వేరుగా బస్సులు నడపాలి

వినతిపత్రం అందజేస్తున్న నందిగాం, మద్దెపల్లి గ్రామాల ప్రజలు

నవీపేట్, ఆగస్టు 24: నందిగాం, మద్దెపల్లి గ్రామాలకు వేర్వేరుగా బస్సులు నడపాలని కోరుతూ నందిగాంకు చెందిన యువకులు శనివారం నిజామాబాద్ ఆర్టీసీ–2 డిపో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రెండు గ్రామాలకు ఒకే బస్సు నడపడంతో విద్యార్థులు పాఠశాలలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎం అందుబాటులో లేకపోవడంతో డిపోలో సూపరింటెండెంట్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు.

స్వర్గరథం అందజేత

ఎడపల్లి, ఆగస్టు24: ఠాణాకలాన్ గ్రామంలో మంగళ్‌పల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గ రథాన్ని శనివారం గ్రామస్తులకు అందజేశారు. మంగళ్‌పల్లి నర్సింహులు 30 ఏండ్ల క్రితం ఊరి నుంచి వెళ్లిపోయారు. గ్రామానికి ఏమైనా సాయం చేయాలనే ఉద్దేశంతో రూ. 2 లక్షల 50 వేలు వెచ్చించి తన తల్లి దండ్రులు సరస్వతి, పెద్ద గంగారాం జ్ఞాపకార్థం స్వర్గ ధామ రథాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు స్వర్గదామ రథాన్ని అందజేస్తున్న దాత